వరంగల్ తూర్పు
నియోజకవర్గం
ప్రజల మాట ప్రగతి బాట
4
ntnews.com
నమస్తే తెలంగాణ
శనివారం 14 అక్టోబర్ 2023

# సబ్బండ వర్గాల సంక్షేమమే సీఎం ధ్యేయం



గిర్మాజీపేట: నన్నపునేనిని సన్మానిస్తున్న నాయకులు

- రాష్ట్ర ఏర్పాటు తర్వాత మెరుగైన అభివృద్ధి
- బీఆర్ఎస్ పాలనలో సంతోషంగా ఉన్న రాష్ట్ర ప్రజానీకం
- తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

గిర్మాజీపేట, అక్టోబర్ 13: సబ్బండ వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. నాయీబ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్‌కు 300 గజాల స్థలం, భవన నిర్మాణానికి రూ. 9 లక్షల నిధులు మంజూరు చేసి, తన సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు సంఘం సభ్యులు ధన్యావాదాలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు శివనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు.. తర్వాత తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ప్రజలు తమ కళ్లతో చూస్తున్నారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణ ప్రజానీకం సుఖసంతోషాలతో మంచి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ అంచెలంచెలుగా ప్రతి వర్గాన్ని బాగు చేస్తూ వస్తున్నారని, తాను కూడా తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందువరుసలో ఉంచినట్లు వివరించారు. కులమత, భేదం లేకుండా సబ్బండ వర్గాలను ఒకటిగా చూసి, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నట్లు వెల్లడించారు. నాయీబ్రాహ్మణ సంఘంతోపాటు 18 సంఘాల వారికి ఇటీవల మంత్రి కేటీఆర్ చేతులమీదుగా స్థల కేటాయింపు చేస్తూ సభావేదికగా ప్రకటించామని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని, తనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కాశీబుగ్గ దసరా ఉత్సవ సమితి సభ్యులు

## బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

కాశీబుగ్గ, అక్టోబర్ 13: చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలో నిర్వహించనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని కాశీబుగ్గ దసరా ఉత్సవ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వానాను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని బతుకమ్మ, దసరా ఉత్సవాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, బయ్యాస్వామి, సమితి కన్వీనర్ దూపం సంపత్, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి గుల్లపెల్లి రాజ్‌కుమార్, ఆర్టీఏ సభ్యులు గోరంటల మనోహర్, గుత్తికొండ నవీన్, ఓంప్రకాశ్ కోలారియా, పోలెపాక మార్టిన్‌లూథర్, వేముల నాగరాజు, సిద్దోజు శ్రీనివాస్, రాచర్ల శ్రీనివాస్, మార్త ఆంజనేయులు, దుబ్బ శ్రీనివాస్, కోట సతీశ్ పాల్గొన్నారు.

## నేటి నుంచి బతుకమ్మ సంబురాలు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 13: వరంగల్ మట్టెవాడలోని రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు మహిళా భక్త బృందంతో బతుకమ్మ వేడుకలను శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 15 నుంచి 23 వరకు దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా శ్రీసుందరకాండ పారాయణం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. అమ్మవారు తొమ్మిది రోజుల్లో తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

## రేపు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టావధానం

పోచమ్మమైదాన్, అక్టోబర్ 13: హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు అష్టావధాన కార్యక్రమం నిర్వహించనున్నారు. శ్రీలేఖ సాహితీ వరంగల్, వేంకటేశ్వరస్వామి పాలకమండలి ఆధ్వర్యంలో అష్టావధాని తిరుకోవలూరు శ్రీ హర్ష కార్యక్రమం చేపట్టనున్నారు. కార్యక్రమంలో కళాకారులు, సాహితీవేత్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

## ఎంగిలి పూల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి

గిర్మాజీపేట, అక్టోబర్ 13: శ్రీరామలింగేశ్వరాలయ ఆవరణలో శనివారం జరుగనున్న ఎంగిలిపూల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అప్పరాజు రాజు తెలిపారు. ఈవో ఎన్ వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు ఇబ్బందులు కలుగకుండా తాగునీటి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఆవరణను విద్యుద్దీపాలతో అలంకరించామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చిట్టిమళ్ల సురేశ్, కలకం రాములు, పప్పుల మంజుల, గంగిశెట్టి హరినాథ్, ఆలయ ప్రధానార్చకుడు తనుగుల రత్నాకర్, ఆలయ సిబ్బంది సౌజన్య పాల్గొన్నారు.



ముగింపు వేడుకల్లో పాల్గొన్న మహిళలు

## ముగిసిన బొడ్డెమ్మ వేడుకలు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 13: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించిన బొడ్డెమ్మ వేడుకలు శుక్రవారం రాత్రి ముగిశాయి. వరంగల్ దేశాయిపేట రోడ్డులోని గణేశ్‌నగర్, టీచర్స్‌కాలనీలో మహిళలు తొమ్మిది రోజులపాటు బొడ్డెమ్మ వద్ద ఆడిపాడారు. శనివారం ఎంగిలిపూల బతుకమ్మ జరుగనున్నందున ముందు రోజు బొడ్డెమ్మ వేడుకలు ముగిసినట్లు మహిళలు తెలిపారు.



బండా ప్రకాశ్‌కు ఆల్బమ్ అందజేస్తున్న సభ్యులు

## ‘ఉర్సు దసరా ఉత్సవాలకు సహకరించాలి’

కరీమాబాద్, అక్టోబర్ 13: ఉర్సు రంగలీలా మైదానంలో జరుగనున్న దసరా ఉత్సవాలకు సహకరించాలని సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవ ఆల్బమ్‌ను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగపురి సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, ఉత్సవ కన్వీనర్ వడ్నాల నరేందర్, ట్రస్టు చైర్మన్ వంగరి కోటి, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, నాగపురి రంజిత్, వొగిలిశెట్టి అనిల్, పొగాకు సందీప్, కార్యనిర్వాహక కార్యదర్శులు బత్తిని అఖిల్, నరిగె శ్రీను సహాయ కార్యదర్శులు నాగపురి మహేశ్, గట్టు గోవర్ధన్, ఎన్ సంతోష్, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

## పాఠశాలలు, కళాశాలల్లో బతుకమ్మ సంబురాలు



గిర్మాజీపేట: వేడుకల్లో పాల్గొన్న పిల్లలు, టీచర్లు

గిర్మాజీపేట/కరీమాబాద్/పోచమ్మమైదాన్, అక్టోబర్ 13: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతిబింబమైన బతుకమ్మ వేడుకలను శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై బతుకమ్మ ఆటపాటలతో హోరెత్తించారు. చార్‌బౌలీలోని శ్రీసరస్వతి విద్యానికేతన్ హైస్కూల్, కేతన్ కాన్వెంట్ పాఠశాల, ఉర్సు బైపాస్ రోడ్డులోని తాళ్ల పద్మావతి కళాశాల, ఎల్‌బీనగర్‌లోని లర్నర్స్ ల్యాండ్ ఉన్నత పాఠశాలలో తంగేడు, గునుగు, చామంతి, బంతి తదితర రకాల పూలతో బతుకమ్మలు తయారు చేసి, ఒకచోట చేర్చి సంబురాలు నిర్వహించారు. విద్యానగర్‌లోని చాణక్య పాఠశాలలో వేడుకలు అంబరాన్నంటాయి.

## రేపు భగవద్గీత శ్లోకపఠనం పోటీలు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 13: ములుగురోడ్డులోని సప్తధామంలో ఆదివారం ఉదయం 10 గంటలకు భగవద్గీత శ్లోకపఠనం పోటీలు నిర్వహించనున్నట్లు శివానందగురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను గురుధామంలో శుక్రవారం ఆవిష్కరించారు. భగవద్గీతపై పిల్లల్లో భక్తిభావం, అవగాహన పెంపొందేలా ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 3,116, ద్వితీయ బహుమతి రూ. 2016, తృతీయ బహుమతి రూ. 1116 అందజేస్తామని వివరించారు. వివరాలకు 9848423133 వాట్సాప్ నంబర్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బండారు సాయి నారాయణ, రేపాల రామచందర్, నరేశ్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గోపీచంద్



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కవిత

## ‘నన్నపునేనిని భారీ మెజార్టీతో గెలిపించాలి’

పోచమ్మమైదాన్, అక్టోబర్ 13: వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని 12వ డివిజన్ కార్పొరేటర్ కావటి కవిత పిలుపునిచ్చారు. డివిజన్‌లోని లక్ష్మీగార్డెన్‌లో శుక్రవారం ఆమె బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, బూత్ ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే నరేందర్ గెలుపు కోసం కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో నాయకులు యెలుగం శ్రీనివాస్, కంకల సదానందం, సోల రాజు, వేణు, నట్ట నారాయణ, వనపర్తి శ్రీనివాస్, అక్బర్, ఓదెలు, జూలూరి శ్రీధర్, రామకృష్ణ, మేకల సమ్మయ్య, కరుణాకర్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ సుధీర్‌బాబు

## డీఈవో ఆధ్వర్యంలో సమీక్ష

వరంగల్‌చౌరస్తా, అక్టోబర్ 13: విద్యార్థులకు నిర్వహించిన పరీక్షా ఫలితాలను వచ్చే ఒకటో తేదీలోగా తల్లిదండ్రులకు చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కో ఆర్డినేటర్ సుధీర్‌బాబు అన్నారు. 27వ డివిజన్ పరిధిలోని గోల్డెన్ ట్రిపోల్ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా విద్యాధికారి డి.వాసంతి ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పూర్తి సమాచారం తల్లిదండ్రులకు తెలిసేలా చూడాలని, నవంబర్ ఒకటిన తల్లిదండ్రులతో ప్రతి స్కూల్‌లో సమావేశం నిర్వహించాలన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ఖిలా వరంగల్, వరంగల్ మండలాల్లోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ‘సెలవుల్లో పాఠశాలలు నిర్వహించొద్దు’

గిర్మాజీపేట, అక్టోబర్ 13: దసరా సెలవుల్లో (ఈ నెల 13 నుంచి 25 వరకు) పాఠశాలలు నిర్వహించొద్దని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో డి వాసంతి ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఏ పాఠశాలలోనైనా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వారి వివరాలను తన దృష్టికి తీసుకురావాలని డీఈవో కోరారు.